క్లుప్తంగా

డాక్టర్ స్వర్ణలతకు అంతర్జాతీయ అవార్డులు


అవార్డులు అందుకుంటున్న డాక్టర్ స్వర్ణలత

పాలకోడేరు: అమెరికాలోని డాక్టర్ రామకృష్ణ సాహె ప్రెసిడెంట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ అమెరికా, చికాగో, మనం ఫౌండేషన్ అధినేత డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లోని బిర్లా మందిర్‌లో గౌరవ డాక్టరేట్ అవార్డు, గౌతమ బుద్ధ సర్వీస్ అవార్డు అందుకున్నారు. భారతదేశంలో సామాజిక సేవ చేస్తూ, దేశంపై ప్రేమ, మానవత్వం, శాంతియుత, మానవ హక్కుల కోసం కృషి చేస్తున్న వారికి ఈ అవార్డులు ఇస్తారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణలతకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సత్కారం


విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పాలకోడేరు: ఉపాధ్యాయుడు విజయకుమార్ సేవలు అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు ప్రశంసించారు. మైప గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు విజయకుమార్‌కు బదిలీ అయిన సందర్భంగా పాఠశాలలో గురువారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు పనిచేసి విద్యార్థులకు చక్కటి బోధన అందించారన్నారు. అనంతరం విజయ కుమార్‌ను, హెచ్ఎం గోపీమూర్తిని ఘనంగా సత్కరించారు. సర్పంచ్ గొట్టుముక్కల జయంతి తిరుపతిరాజు, ఎంపీటీసీ సభ్యులు తంగెళ్ల మంజుల ఆనందరాజు, సచివాలయ కార్యదర్శి సాయి, వనజ గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష అమలుపై ప్రత్యేక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణారావు

కాళ్ల: ప్రభుత్వం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమం విధివిధానాలపై కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణారావు, ఎంపీడీఓ జి.స్వాతి, వ్యవసాయశాఖ ఆకివీడు ఏడీఏ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాటర్ టాక్స్, రీసర్వే, కౌలు రైతు కార్డుల తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ జయవాసుకి, వీఆర్వోలు, అగ్రికల్చరల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

ముగిసిన మావుళ్లమ్మ జాతర

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ముగింపురోజు అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 5 వేల మందికి అన్న సమారాధన చేశారు. వారం రోజులుగా మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ పునర్నిర్మాణ కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

'కేజీ' రహదారికి మహర్దశ

- రూ.22.50 కోట్లతో కలవపూడి–గణపవరం రాష్ట్ర రహదారి విస్తరణ, అభివృద్ధి
- 3 కి.మీ మేర శరవేగంగా రిటెయినింగ్ వాల్ నిర్మాణం, తుది దశలో పనులు


కలవపూడి-గణపవరం మధ్య పంటకాలువకు రిటెయినింగ్ వాల్ నిర్మించిన దృశ్యం

ఆకివీడు: కలవపూడి–గణపవరం (కేజీ) రహదారి విస్తరణ, అభివృద్ధిలో భాగంగా చేపట్టిన రిటెయినింగ్ వాల్ నిర్మాణం చరిత్ర సృష్టిస్తోంది. కేంద్ర రహదారుల ఫండ్ (సీఆర్ఎఫ్) నిధుల నుంచి రూ.22.50 కోట్లు ఈ రహదారి అభివృద్ధికి కేటాయించారు. దీనిలో భాగంగా మూడు కిలోమీటర్ల మేర క్రొవ్విడి–పెదకాపవరం గ్రామాల మధ్య పంట కాల్వకు రిటెయినింగ్‌వాల్ నిర్మాణం, చినకాపవరం నుంచి క్రొవ్విడి వరకు మూడు కిలోమీటర్ల మేర రహదారి పునర్నిర్మాణం, ఏలూరుపాడు నుంచి చెరుకుమిల్లి శివారు ప్రాంతం వరకు 3.8 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ, పునర్నిర్మాణ పనులకు ఏప్రిల్ 20న రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పెదకాపవరం గ్రామంలో భూమిపూజ చేశారు. అప్పటినుంచి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పర్యవేక్షణలో నిర్మాణ పనులను వేగవంతం చేశారు. యుద్ధప్రాతిపదికన రిటెయినింగ్ వాల్ నిర్మాణంతో కేజీ రహదారిలోని పెదకాపవరం–క్రొవ్విడి గ్రామ ప్రజలతో పాటు రహదారిలో రాకపోకలు సాగించే వాహనచోదకులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు దీర్ఘకాలికంగా ఉన్న రహదారి సమస్య పరిష్కారం కానుంది. ఈ ప్రాంతంలో వర్షం కురిస్తే రోడ్డు రెండు మూడు అడుగుల లోతును నీరు నిలిచి, గుంతలతో నిండిపోయేది. సుమారు 15 ఏళ్ల క్రితం నిర్మించిన కేజీ రహదారికి ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోయేవారు. రిటెయినింగ్ వాల్ నిర్మాణం, రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయింది. కాళ్ల మండలం కలవపూడి నుంచి గణపవరం వరకు ఈ రహదారి రాష్ట్ర రహదారిగా ఉంది. పలు మండలాలను అనుసంధానం చేస్తూ జాతీయ రహదారుల్ని కలుపుతూ, వ్యాపారులకు, రైతులకు, ఆక్వా రైతులకు ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడనుంది. మూడు నెలల్లోనే రహదారి పనులు శరవేగంగా జరగడంతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. కేజీ రహదారికి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేసిన రొయ్య రైతుల సంఘం జాతీయ అధ్యక్షులు ఇందుకూరి మోహనరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), ఎంపీపీ కఠారి జయలక్ష్మి, తదితరులకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అందేవారి బోదె ఆక్రమణలపై త్వరలో సర్వే

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని అందేవారి బోదే ఆక్రమణపై త్వరలో సర్వే చేయిస్తామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆయన ఫోన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. సర్వే పూర్తయిన తర్వాత ఆక్రమణల తొలగింపుకు రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపడతారన్నారు. ఆక్రమణదారులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. పార్టీ రహితంగా, పారదర్శకంగా అక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతం ఆక్రమణకు గురైన విషయం ప్రజలకు తెలుసని, గత పాలకుల అండదండలు, నాయకుల ప్రోద్బలం, అధికార దాహంతో కొంతమంది ఆక్రమణలకు దిగారని పీవీఎల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉండడం వల్లే దానిలో సిల్టు పెరిగిపోయిందని, దీంతో డ్రెయిన్‌లో ప్రవాహం సరిగ్గా లేక చుట్టుపక్కల ప్రాంతాలను ముంచెత్తుతోందన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన మురుగు కాలువలు గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచాయని పీవీఎల్ ఏద్దేవా చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఆక్రమణలను అడ్డుపెట్టుకోవడం దురదృష్టకరమన్నారు. అందేవారి బోదే, గంగానమ్మకోడు, మూలలంక పంట మురుగు కాలువల అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధుల మంజూరు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నామని పీవీఎల్ వివరించారు.

వ్యక్తిపై దాడి.. ఐదుగురిపై కేసు

ఆకివీడు: పాత గొడవలను పురస్కరించుకుని వ్యక్తిపై దాడి చేసిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దుంపగడప గ్రామానికి చెందిన తిరుమాని శ్రీనివాసరావుపై అదే గ్రామం పల్లిపాలెంకు చెందిన బొడ్డు ప్రసాదు, బొడ్డు గణేష్, తిరుమాని మణికంఠ, తిరుమాని కిషోర్, బొడ్డు మహేష్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయాలతో ఉన్న శ్రీనివాసరావును ఆకివీడు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గురువారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: లంకలకోడేరు 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ వెలివెల ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు దగ్గులూరు, బల్లిపాడు, శివదేవునిచిక్కాల, సానివాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ తెలిపారు.

స్థానిక సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి

ఆకివీడు: మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులు, మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను) పిలుపునిచ్చారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ప్రజాప్రతినిధులు గుర్తించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో స్థానిక సంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎంపీపీ జయలక్ష్మి మాట్లాడుతూ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రజలకు అత్యవసరమైన పనుల్ని గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో చేపడుతున్నారని చెప్పారు. ఎంపీడీఓ కందుల వాణి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత వివిధ శాఖల పనితీరుపై సమీక్ష చేశారు. ఎంఈఓ ఎ.రవీంద్ర మాట్లాడుతూ నాడు–నేడు పనులు జరుగుతున్నాయని చెప్పారు. అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యాకానుకలు, అమ్మ ఒడి, పుస్తకాలు అందజేశామని చెప్పారు. ఏఓ ప్రియాంక మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైందని, రైతులు వ్యవసాయ శాఖ గుర్తించిన వంగడాల్ని మాత్రమే సాగు చేయాలని సూచించారు. నాట్లు వేసిన అనంతరం ఈ–క్రాప్ నమోదు ప్రారంభిస్తామన్నారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఏఓ ప్రసాదరాజు మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ సరఫరా నిలుపుదలకు అత్యధిక వినియోగమే కారణమన్నారు. అధిక లోడ్‌లతో గ్రిడ్‌లు విఫలమవ్వకుండా చూసుకునేందుకు అప్పటికప్పుడు సరఫరా నిలుపుదల చేయాల్సి వస్తుందన్నారు. లోటల్టేజ్ సమస్య పరిష్కారానికి పట్టణంలో, గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జలవనరులశాఖ జేఈ రాము మాట్లాడుతూ గోదావరిలో సరిపడినంత నీరులేకపోవడంతో పంట కాల్వలకు నీటి సరఫరా తగ్గిందన్నారు. వర్షాలు కురవడం మొదలైన తరువాత నీటిమట్టం పెంచుతామని చెప్పారు. ఆయా పంట కాల్వల్లో షట్టర్లు, ఇతర పనులకు నిధులు మంజూరు అయ్యాయని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ నిధులు మంజూరు అయినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని చెప్పారు. మంచినీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, సర్పంచ్‌లు సహకరించాలన్నారు. ఇతర శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాల్ని వివరించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు కిళ్లి రామకృష్ణ, సైదాల సూర్యనారాయణ, తహసీల్దార్ ఎస్బీ విజయలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నెలాఖరు నాటికి నారుమడులు వేసుకోవాలి


మాట్లాడుతున్న ఏఓ జయవాసుకి

కాళ్ల: మండలంలో రైతులు జూన్ నెలాఖరు నాటికి నారుమడులు వేసుకోవాలని వ్యవసాయశాఖాధికారి జయవాసుకి కోరారు. కాళ్ల వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో 4,316 ఎకరాల్లో వరి సార్వా సాగు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో సుమారు 216 ఎకరాలలో నారుమడులు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారన్నారు. జక్కరం, బొండాడ, కోపల్లె, సీసలి గ్రామల్లో ఇప్పటికే నారుమడులు వేశారన్నారు. జూన్‌లో ఎంటీయూ 1,318 రకం వరి వంగడాలను నారుమడులుగా వేసుకోవాలని, నారముడులు వేయడంలో ఆలస్యం అయితే ఎంటీయు 1064, 1061 రకాల వరి వంగడాలను వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గత ఏడాది 1470 మంది కౌలు రైతులకు కౌలు రైతు కార్డులు అందించామని, ఈ ఏడాది కూడా వారికి కార్డులు అందజేస్తామన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రంలో వేలిముద్రలు (బయోమెట్రిక్) వేయాలని, లేకపోతే ఈ క్రాప్ నమోదు జరగదన్నారు. దీనివల్ల ధాన్యం కొనుగోలు, బీమా వర్తించదన్నారు. మండలంలో మట్టి నమునాల పరీక్షలలో భాగంగా ఇప్పటివరకు 224 నమూనాలను సేకరించామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి వార్డులో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం


సీసీ రోడ్డు నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పనలో భాగంగా ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని ఒకటో వార్డు మెంటేవారి తోటలో రూ.1.20 కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెంటేవారి తోటలో వండర్ కిడ్స్ స్కూల్ నుంచి బైపాస్ రోడ్డు వరకు 380 మీటర్ల మేర సీసీ రోడ్డు, వండర్ కిడ్స్ స్కూల్ నుంచి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వరకు 250 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఈ రెండు రోడ్ల నిర్మాణానికి సంబంధించి రూ.1.20 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, మావుళ్లమ్మ దేవస్థానం ధర్మకర్త ముత్యాల రామారావు, ముత్యాల బోసుబాబు, రామిశెట్టి జయసూర్య, ముత్యాల దొరబాబు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం


దిరుసుమర్రు హైస్కూల్లో విద్యార్థులకు నగదు పురస్కారాలను అందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని తలచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.వేలాది కోట్లు విద్యారంగానికి ఖర్చు చేస్తున్నారని సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా మెరిట్ విద్యార్థులకు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజకవర్గంలో నాడు–నేడు పథకం ద్వారా రూ.21 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి చేశారన్నారు. అలాగే కార్పొరేట్ కంటే నాణ్యమైన విద్య అందించడంతో పాటు జగనన్న విద్యా కానుక కిట్లు, జగనన్న గోరు ముద్ద ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇంగ్లిష్ మాధ్యమంతోపాటు 8, 9, 10 తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి బైజూస్ సాఫ్ట్‌వేర్ ద్వారా కార్పొరేట్ విద్యను అందిస్తున్నారన్నారు. మండలంలో మన పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఐ.రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు కేతా నాగమణి, తేలి జోసెఫ్ రవికుమార్, జంపన తేజశ్రీ, బేతాళ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక


ముక్కు వైష్ణవిదుర్గ

ఆకివీడు: కుప్పనపూడి శివారు తాళ్లకోడుకు చెందిన ముక్కు వైష్ణవి దుర్గ అనే విద్యార్థిని జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైంది. తాళ్లకోడు ఎంపీపీ స్కూల్‌లో 5వ తరగతి చదివిన వైష్ణవీ దుర్గ పేద కుటుంబానికి చెందినది. ప్రభుత్వ పాఠశాలలో చదివి నవోదయకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

మట్టి రవాణాతో జారుడు బల్లలా రోడ్డు

- స్పందించిన పంచాయతీ పాలకవర్గం
- ఆర్అండ్‌బీ రోడ్డుపై మట్టి తొలగింపు


కోమటిగుంట ఆర్అండ్‌బీ రోడ్డుపై మట్టిని తొలగిస్తున్న దృశ్యం

కాళ్ల: గత కొంతకాలంగా మండలంలో మట్టి వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రవాణాలో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కోమటిగుంట ఆర్అండ్‌బీ రహదారి జారుడుబల్లలా మారింది. మట్టి రవాణా సమయంలో వాహనాల నుంచి మట్టి పెళ్లలు రోడ్డుపై పడి అంతంత మాత్రంగా ఉన్న ఆర్అండ్‌బీ రహదారి ఛిద్రంగా మారింది. గత రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలకు ఈ రహదారి బురదమయం కావడంతో దీనిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అంతేకాకుండా అధికారులు, పంచాయతీ సర్పంచ్, సభ్యులు హెచ్చరిస్తున్నా లెక్కచేయకుండా ఇష్టారాజ్యంగా మట్టి రవాణా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలు, విద్యార్థుల, ప్రయాణికుల ఇబ్బందులను తీర్చేందుకు పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు చొరవ తీసుకున్నారు. కూలిలను ఏర్పాటు చేసి రోడ్లపై పడ్డ మట్టిని తొలగించే పనులు చేపట్టారు.

రైతుల కోసం వైఎస్సార్ సీపీ నేత ఔదార్యం

రూ.50 వేలు సొంత సొమ్ముతో కాలువ పూడిక తొలగింపు


పులిగుమ్మ కాలువ పూడిక తొలగింపు పనులు చేయిస్తున్న కొండరాజు, రైతులు

ఉండి: రైతుల విన్నపాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.50 వేల సొంత సొమ్ముతో పంట కాలువ పూడిక తొలగింపు పనులు చేయించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, వెలివర్రు మాజీ ఉపసర్పంచ్ ముదునూరి కొండరాజు. వెలివర్రు గ్రామానికి చెందిన కొండరాజు స్థానిక రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పులిగుమ్మ కాలువను సుమారు కిలోమీటరు మేర పూడిక తొలగింపు పనులు చేయించారు. ఎన్నార్పీ అగ్రహారం పరిధిలో ఉండి కాలువ నుంచి ప్రారంభమైన ఉండి శివారు పులిగుమ్మ వరకు కాలువ ప్రవహిస్తుంది. ఈ కాలువ పరిధిలో 150 ఎకరాల వరి, 450 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. నారుమడులు పోసేందుకు సాగునీటి కొరతతో స్థానిక రైతులు కొండరాజును కలిసి సమస్యను విన్నవించారు. దీంతో తన సొంత సొమ్ము వెచ్చించి పంటకాలువ పూడిక తొలగింపు పనులను గురువారం చేపట్టారు. కొండరాజు మాట్లాడుతూ జగనన్న స్ఫూర్తిగా అందరికీ మంచి జరిగే పనులు చేసేందుకు తాను ముందుకు వచ్చానన్నారు. ఆయన పాలనలో ఎవ్వరూ ఇబ్బందులు పడకూడదనే రైతులకు సాయం చేసినట్లు తెలిపారు. ఈ పని ద్వారా రైతులకు సహకారం అందించడం చాలా సంతోషంగా ఉందని కొండరాజు తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో అధికారుల తనిఖీలు

తణుకు: పట్టణానికి చెందిన ప్రైవేటు ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన రాధాకృష్ణ న్యూరో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో పలు రికార్డులు తనిఖీ చేశారు. తమ ఆసుపత్రికి తీసుకువచ్చే రోగులను సంబంధించి పీఎంపీలకు 30 శాతం కమిషన్ ఇస్తామంటూ వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి మహేశ్వరరావు ఆధ్వర్యంలో విచారణ కమిటీ సభ్యులు ఆసుపత్రిని తనిఖీ చేసి వైద్యులు కార్తీక్ ఈశ్వర్‌ను విచారణ చేశారు. ఈ సంఘటపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్రనాయకులు సైతం వివరణ కోరారు. బహిరంగంగా పీఎంపీలకు కమీషన్ ఇస్తామని ప్రకటించడం చట్టరీత్యానేరమని అధికారుల పేర్కొన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వెల్లడించారు.

నేడు, రేపు భీమవరంలో సూత్రా ఎగ్జిబిషన్

సాక్షి, భీమవరం: పట్టణంలోని హోటల్ ఆనంద్ ఇన్‌లో ఈ నెల 23, 24 తేదీల్లో సూత్రా ఫ్యాషన్ ఎగ్జిబిషన్ అండ్ సేల్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించే ఎగ్జిబిషన్‌లో మహిళల కోసం ఎత్నిక్‌వేర్, అకేషన్ వేర్, ట్రెడిషినల్ వేర్, ఫ్యూజన్ వేర్, జ్యూయలరీ, గిఫ్ట్ ఐటమ్స్, హోమ్ డెకార్, హ్యాండీ క్రాఫ్ట్స్ వంటివి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుతం ప్రభుత్వ పాఠశా లల్లో విద్య కార్పొరేట్ స్థాయి విద్యను మించి మెరుగైన విద్య అందుతుందని మండల విద్యాశాఖ అధికారి–2 ఆర్ఎస్‌వీఎస్ జి శర్మ అన్నారు. గురువారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శర్మ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ తోకల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

చించినాడలో..

యలమంచిలి: చించినాడ పంచాయతీ ఆర్లపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాలకొల్లుకు చెందిన అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు నోటు పుస్తకాలు, కుర్చీలు అందజేయగా, వాటిని సర్పంచ్ దంగేటి రాజమణి, ఉప సర్పంచ్ రుద్రరాజు చిన్నాల చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజమణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.వేల కోట్లు వెచ్చిస్తోందన్నారు. అలాగే విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమన్నారు. ప్రధానోపాధ్యాయుడు అడ్డాల నాని తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డు పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

పోడూరు: కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు వీఆర్‌ఓలను, వీఏఏలను ఆదేశించారు. పోడూరు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన వీఆర్‌ఓలు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్(వీఏఏ)లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కౌలు రైతుల గుర్తింపు కార్డులు, మట్టి నమూనా పరీక్షలు, పీఎం కిసాన్ యోజన ఈకేవైసీ అంశాలపై ఆయన వారితో చర్చించారు. కౌలు రైతులంతా గుర్తింపు కార్డులు పొందేలా వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు గ్రామాలవారీగా ఎంతమంది కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చారో? సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మట్టి నమూనాలు త్వరగా సేకరించి ఆన్‌లైన్ పక్రియ పూర్తి చేయాలని వీఏఏలను ఆదేశించారు. ఇప్పటివరకూ కూడా పీఎం కిసాన్ యోజనకు ఈకేవైసీ చేయించుకోని రైతులను గుర్తించి త్వరగా ఆ పక్రియ పూర్తి చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పాలకొల్లు ఏడీఏ ఎ.పార్వతి, తహశీల్దార్ ఆర్వీ కృష్ణారావు, ఎంపీడీఓ డి.సుహాసిని, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఆర్ఐ కె.రాంబాబు, ఏఈఓ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.